క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



పెదకూరపాడు: మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం పెదకూరపాడులోని నిత్యజీవా హోసన్నా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ బత్తుల ప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రకాష్ మాట్లాడుతూ శాంతి, కరుణ, ప్రేమ కలిగి ఉండటమే నిజమైన క్రిస్మస్ అన్నారు. పాస్టర్లకు బ్యాగులను అందించారు. ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు పాస్టర్ జొన్నకూటి జయరావు, ట్రెజరర్ పాస్టర్ క్రీస్తు దాసు, పాస్టర్ రాజేంద్రప్రసాద్, సెక్రెటరీ పాస్టర్ నిర్మలరావు, జాయింట్ సెక్రెటరీ పాస్టర్ గుంటూరు బాబురావు, సభ్యులు పాస్టర్ పేతురు, పాస్టర్ ఏసుదాసు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు రేబిస్ టీకాలు

సాక్షి ఎఫెక్ట్

సత్తెనపల్లి: పట్టణంలోని వీధి కుక్కలకు రేబిస్ టీకాలు అందించేందుకు ఏరియా వెటర్నరీ హాస్పిటల్ సిబ్బంది సంసిద్ధంగా ఉన్నట్లు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సాక్షిలో వీధి కుక్కల బెడదపై ప్రచురితమైన కథనానికి ఆయన మంగళవారం స్పందించారు. వీధి కుక్కలకు టీకాలు వేయడానికి ప్రభుత్వ పశు వైద్యశాలలో టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీధి కుక్కలకు టీకాలు అందించడంలో మున్సిపాలిటీ సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయడానికి మున్సిపాలిటీ కార్యాలయానికి విధి విధానాలు, క్యాంపు నిర్వహించేందుకు కార్యాచరణ సమర్పించడం జరిగిందన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

సత్తెనపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ఎస్‌డీజీ శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎంపీడీవో బి.శ్రీనివాసరెడ్డి పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలపై దృష్టి పెట్టాలన్నారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ భావన, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసరావు, డీపీఆర్సీ డీఆర్పీ నరసింహానాయక్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు అధికారులు పాల్గొన్నారు.

సత్యకిరణ్‌కు సేవా భూషణ్ అవార్డు



సత్తెనపల్లి: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కాకినాడలోని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన బిషప్ ముక్తిపూడి సత్యకిరణ్‌ను సేవాభూషణ్ అవార్డుతో సత్కరించారు. సామాజిక సేవ, మానవ హక్కుల రక్షణ, పరిరక్షణ, లీగల్ అవేర్నెస్ అందించినందుకు గాను హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ గుర్తించి అవార్డు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు బొడ్డపాటి దాసు, కర్రి భామిరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యపై మక్కువ చూపాలి



ముప్పాళ్ళ: జాతీయ సేవా పథకంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని లీడ్ ఇండియా స్కూల్‌లోని విద్యార్థులకు వ్యవసాయ విద్య ప్రాముఖ్యత పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల పంట మొక్కలను, మందులను చూపిస్తూ వాటి వివరించారు. మందులను వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డా.జి.విజయ్‌కుమార్, డాక్టర్ జి.సంధ్యారాణి, పాఠశాల ప్రిన్సిపల్ వి.ప్రశాంతి, మాదల, నార్నెపాడు, చాగంటివారిపాలెం, సాతులూరు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

అచ్చంపేట: మండలంలోని వేల్పూరు ఎస్సీ కాలనీకి చెందిన క్రీడాకారులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ మంగళవారం వాలీబాల్, షెటిల్ బ్యాడ్మింటన్ కిట్స్ అందజేసింది. కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు గనుపల్లి సునీల్ బాబు చేతుల మీదుగా క్రీడాకారులకు స్పోర్ట్ కిట్స్ మంగళవారం క్రీడాకారులు స్వీకరించారు. ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరిముల్లాబాబు మాట్లాడుతూ యువకులు క్రీడా నైపుణ్యానికి పెంపొందించుకునేందుకు క్రీడా సామగ్రి, నాలుగు సిమెంట్ బల్లలు కావాలని కోరినట్లు చెప్పారు. రూ.6 వేలు విలువచేసే క్రీడా సామగ్రి పంపిణీ చేశామన్నారు. క్రీడాకారులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విప్పర్ల చెక్‌డ్యాం



హసనాబాద్ చెక్‌డ్యాం

చెక్ డ్యాంలు ఎక్కడా?

- ఆలనపాలన లేని చెక్‌డ్యాంలు
- పట్టించుకోని అధికారులు.
- ప్రతి పంచాయతీలో నిరుపయోగం

క్రోసూరు: గతంలో వర్షాభావ పరిస్థితుల నుంచి రైతులు పశువులను కాపాడేందుకు ప్రతి పంచాయతీలో చెక్‌డ్యాంల ఆవశ్యకతను గుర్తించి నిర్మించారు. ప్రస్తుతం అవి ఆలనాపాలన లేక నిరుపయోగంగా మారుతున్నాయి. చెక్‌డ్యాంలు వరదలు, వాగులు నుంచి ప్రవహించిన నీటికి అడ్డుకట్టగా ఉపయోగపడి ఆ నీటిని నిల్వచేసుకునే వీలుండేది. చెక్‌డ్యాం కింద పంట పొలాలకు, వేసవిలో పశువులకు నీటి ఎద్దడి లేకుండా ఉపయోగపడేవి.

క్రోసూరు, విప్పర్ల, ఊటుకూరు, బయ్యవరం, అనంతవరం, ఆవులవారిపాలెం, పెరికపాడు, 88త్యాళ్లూరు, గుడిపాడు, దొడ్లేరు, గాదెవారిపాలెం, నాగవరం, హసానబాద్, పీసపాడు, అందుకూరు, బాలమర్రు పంచాయతీలున్నాయి. వీటికి అనుబంధ గ్రామాలు మూడున్నాయి. క్రోసూరు, అందుకూరు ఊటుకూరు, బయ్యవరం, దొడ్లేరు మినహా అన్ని గ్రామాల్లో చెక్‌డ్యాంలు నిర్మించారు. వాగులు, చెరువులున్న గ్రామాల్లో చెక్‌డ్యాంలు నిర్మించలేదు. క్రోసూరు, దొడ్లేరు, అందుకూరు, ఊటుకూరు గ్రామాల్లో వాగులు, చెరువులున్నాయి.

గతంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతుల అవసరాల కోసం పొలాల్లోనే వాటర్ షెడ్లు నిర్మించుకునేలా విస్తృత అవగాహన కల్పించారు. వాగుల మీద చెక్‌డ్యాంలు నిర్మించాలంటే చెక్‌డ్యాం కింద పొలాల ముగి నష్టపోతున్నామని కొంత మంది రైతులు అడ్డు చెప్తున్నారు.



హసనాబాద్‌లో చెక్‌డ్యాం కోసం కొండపక్కగా తవ్విన దృశ్యం(ఫైల్)

నిర్మాణాలకు ఆదేశాలున్నాయి

చెక్‌డ్యాంలు నిర్మించాలని ఆదేశాలున్నాయి. అయితే అందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారు కాలేదు

– రమేష్, పంచాయతీరాజ్ ఏఈ, క్రోసూరు

చెక్ డ్యాంలు అవసరం



నీటి నిల్వలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పాలకులు ప్రతి గ్రామంలో చెక్‌డ్యాంలు నిర్మించి, వాటిని కాపాడే విధంగా అధికారులను ఆదేశించాలి.

– వి. విజయసారథిరెడ్డి, క్రోసూరు

నీటి అసవరం ప్రతి ఒక్కరికీ తెలియజేయాలి



ప్రతి నీటి బొట్టు ఎంతో అవసరం. వర్షాలు సకాలంలో కురవకపోతే నీటి ఎద్దటి ఏర్పడుతుంది. నీటిని నిల్వ చేసుకునే చెక్‌డ్యాంలు తప్పనిసరిగా ఉండాలి

– సయ్యద్ అబ్దుల్ రహిమాన్, రైతు, దొడ్లేరు

పోరాటాల ఫలితమే మానవ హక్కులు

అమరావతి: దేశంలో స్వేచ్ఛా, సమానత్వం, వివక్ష, జాతీయ సమైక్యత, శాంతి వంటి అంశాలు మానవ హక్కులు ద్వారా సాధించడం అందరి బాధ్యతని గుంటూరు జిల్లా సివిల్ కోర్టు జడ్జి లీలావతి అన్నారు. మంగళవారం స్థానిక గుడ్ షెఫర్డ్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ మానవ హక్కులు పూర్తిస్థాయిలో అమలు జరగాలంటే మహిళలు, యువత చైతన్యవంతమై.. మానవ హక్కుల పరిరక్షణకు ముందుకు రావాలన్నారు. సమాజంలో ఎటువంటి తారతమ్యాలు లేకుండా సమానత్వం అమలు అయితే.. మానవ హక్కులు పరిరక్షింపబడినట్లన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి కృష్ణారెడ్డి, సంస్థ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది మహనీయుల ఉద్యమాల ఫలితమే మానవ హక్కుల పరిరక్షణ చట్టాలకు కారణమని సంజన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు జి.శ్రీధర్, సీనియర్ న్యాయవాది బత్తిన శ్రీనివాస్‌బాబు అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా ప్రతి వ్యక్తికి ఉన్న హక్కులను పొందుతూ బాధ్యతలు కూడా నెరవేర్చాలని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు పూజల వెంకటకోటయ్య, దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు జొన్నలగడ్డ విజయ్‌కుమార్, బొక్క సంగీతరావు, బంకా తిరుపతిరావు, బాదినీడి శ్రీనివాస్‌యాదవ్, అప్పాపురపు నరేంద్ర, పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలావతి

మానవ హక్కుల దినోత్సవం

రాజుపాలెం: మండలంలోని కొండమోడు పరిధి వీరమ్మ కాలనీ ఎంపీపీ పాఠశాలలో మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గరికపాటి శంకరరావు, ఉపాధ్యక్షుడు కె.కుమార్, గౌరవ అధ్యక్షుడు చిదేళ్ల మల్లికార్జునరావు, కాకుమాను శ్రీనివాసరావు, దూరి చిన్నబ్బాయి, కురుముల వీరమ్మ, హెచ్ఎం వీరబాలనాగేంద్రం, ఉపాధ్యాయులు మహాలక్ష్మి పాల్గొన్నారు.

చౌడు నివారణకు జిప్సం వాడాలి

రాజుపాలెం: మండలంలోని ఇనిమెట్ల గ్రామ సమీపంలోని వరి పైరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య జేజీఎల్ రకం వరి పైరులో పెరుగుదల లేకపోవడం, మొక్కలు కుచించుకు పోవడం గమనించారు. దీనికి కారణం భూమిలో సౌడు శాతం ఎక్కువగా ఉండటమని తెలిపారు. దుక్కిదున్నే సమయంలో పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు వేసి దుక్కి కలయదున్నాలని తెలిపారు. జిప్సం ఎకరానికి 500కిలోలు వేసి భూమిలో కలయదున్నాలని తెలిపారు. వీఏఏ సీహెచ్ రూప పాల్గొన్నారు.

రగ్బీ క్రీడాకారులకు అభినందన



అచ్చంపేట: జిల్లా స్థాయిలో నర్సరావుపేటలో జరిగిన రగ్బీ క్రీడల్లో తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి, జిల్లా జట్టుకు ఎంపికై నట్లు పాఠశాల పీడీ ఆలపాటి సుజాత తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఉపాధ్యాయులు అభినందించారు. సందెపోగు లీలాక్షి, రమావత్ జయప్రకాష్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 15న ఫిరంగిపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఇద్దరూ పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావు, సుధారాణి, ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీల సుస్థిరాభివృద్ధి పై శిక్షణ

క్రోసూరు: పంచాయతీల్లో వివిధ శాఖల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఎస్ఐఆర్డీ రాష్ట్ర అబ్జర్వర్ కె.మోహన్‌రావు హాజరయ్యారు. ఎంపీపీ పి.కోటయ్య గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల అధివృద్ధికి ప్రతి శాఖ అధికారి నూటికి నూరశాతం కృషి చేయాలని కోరారు. ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ మాధవి, వివిధ శాఖల అధికారులు, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధికి శిక్షణ తరగతులు

నకరికల్లు: ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు సుస్థిరత సాధించే దిశగా గ్రామాలు అభివృద్ధి చెందడానికి పంచాయతీరాజ్ సిబ్బంది సమర్థంగా పనిచేయాలని డివిజనల్ అభివృద్ధి అధికారి రాజగోపాల్ సూచించారు. సుస్థిరాభివృద్ధి స్థానికీకరణ అంశంపై మండలస్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 రకాల అంశాలపై ఈ నెల మంగళవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు బ్యాచ్‌లవారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2030 నాటికి ఐక్యరాజ్యసమితి, భారత ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి సాధించేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీఓ జి.కాశయ్య, సహాయ కోర్సు డైరెక్టర్‌గా ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, ఎంఓటీలుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షేక్.తస్లీమా, హెల్త్ సూపర్‌వైజర్ టి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.ఆనందకుమారి, ఏపీఎం జె.సమాధానం, పంచాయతీ కార్యదర్శులు నర్రా మమత, కె.అప్పారావు వ్యవహరించారు.



సూచనలిస్తున్న డివిజనల్ అభివృద్ధి అధికారి రాజగోపాల్

విద్య వ్యాపారం కాదు

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు: విద్య వ్యాపారం కాదని, ప్రతిభ కలిగిన ప్రతి ఒక్కరిని ప్రోత్సహించేలా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు కృషి చేయాలని పెద్దకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. జీఆర్‌సీ ఆర్కే చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్ పోటీలను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ పాఠశాలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి గ్రామీణ స్థాయిలో ప్రతిభగల క్రీడాకారులను రాష్ట్రానికి అందిస్తున్నట్లు కొనియాడారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి ఉన్నత స్థాయిలో ఎదగాలని కోరారు. గ్రామ పెద్దలు ఎస్‌వీఎస్ వరప్రసాద్, ఆర్తిమల్ల రమేష్, గల్లా బాబురావు, బెల్లంకొండ రామ్ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, షేక్ ముంతాజ్, మాజీ ఎంపీపీ పాటి బండ్ల శివమ్మ, సత్యం, జి ఆర్ సి ఆర్ కే చైతన్య పాఠశాల నిర్వాహకులు కవిత, రాము పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు సన్మానం

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

సత్తెనపల్లి: గ్రామ సభల ద్వారా రెవెన్యూ సమస్యలను రైతులు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలోని నందిగామ గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శిస్తారని, భూములకు సంబంధించిన అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి

రెవెన్యూ సదస్సుకు 70 దరఖాస్తులు

రాజుపాలెం: మండలంలోని పెదనెమలిపురి గ్రామ సచివాలయం–2లో రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో భూ సమస్యలపై, కార్డుల కోసం 70 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు దుర్గేష్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జానీబాషా, ఆర్ఐ ఎస్.వంశీకృష్ణ, వీఆర్వో రజని తదితరులు పాల్గొన్నారు.

భూములకు వెళ్లేందుకు అడ్డు తగులుతున్నారు

అచ్చంపేట: గ్రామంలో 120 ఎకరాలకు పైగా ఉన్న పంట భూములకు వెళ్లేందుకు వీలులేకుండా ఇద్దరు వ్యక్తులు దారిని ఆక్రమించుకుని, ఇబ్బంది పెడుతున్నారని గింజుపల్లి రైతులు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సదస్సు గింజుపల్లిలో మంగళవారం నిర్వహించారు. రైతుల ఫిర్యాదుపై స్పందించిన తహసీల్దారు గ్రామంలోకి వెళ్లి ఆ ఇద్దరి గురించి ఆరా తీశారు. ఒకరు దారికి అడ్డంగా రేకులు షెడ్ వేసుకోగా, మరొకరు కంచె వేశారు. ప్రభుత్వ బాటను ఆక్రమించుకోవడానికి వీలులేదని వెంటనే కంచె తీసేయాలని, లేకుంటే చర్యలు తీసుకుంటానని తహసీల్దారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కంచె తీసేందుకు సదరు రైతు అంగీకరించాడు. రేకుల షెడ్డు వేసుకున్న మహిళ తాను నిరుపేదనని, వేరే చోట స్థలం చూపిస్తే వెళ్తానని చెప్పడంతో తహసీల్దారు పరిశీలిస్తానన్నారు. షెడ్డు నిర్మాణానికి అయిన రూ.30వేలు రైతులు ఇస్తామని చెప్పడంతో సమస్య పరిష్కారమైంది. సదస్సులో మొత్తం 70 అర్జీలు రాగా 10 అర్జీలను పరిష్కరించినట్లు తహసీల్దారు తెలిపారు. మిగిలినవి త్వరలో పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో యూనిట్ సమన్వయకర్త పసుపులేటి పపిరెడ్డి, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

నేడు పలుదేవర్లపాడులో రెవెన్యూ సదస్సు

ముప్పాళ్ళ: మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే సదస్సులో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

బీపీటీ 3082 రకం వరి పంట పరిశీలన

అందుకూరు(క్రోసూరు): మండలంలోని అందుకూరు గ్రామంలో రైతు జంగా శంకర్‌రావు సాగు చేసిన వరి నూతన రకం బీపీటీ 3082 రకాన్ని వరి పరిశోధన కేంద్రం, బాపట్ల శాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ హరిత మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. శాస్త్రవేత్తలు ఎన్నో కొత్త వంగడాలను సృష్టించి రైతులకు అందుబాటులోకి తీసుకురావడం వల్ల నేడు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో , ఎగుమతిలో భారతదేశం ముందంజలో ఉన్నదన్నారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ బీపీటీ 3082 రకం అన్ని రకాల పురుగులు, తెగుళ్లను తట్టుకుంటుందన్నారు. బీపీటీ 5204 రకంతో పోలిస్తే 10–15 శాతం అధిక దిగుబడి వస్తుందన్నారు. రసాయన ఎరువుల వినియోగం కూడా తక్కువ అని తెలిపారు. సాగు చేసిన రైతు జంగా శంకర్ రావు మాట్లాడుతూ బీపీటీ రకం 3082 రకాన్ని గత సంవత్సరం కూడా సాగు చేసినట్లు తెలిపారు. ఈ రకం సాగు పట్ల సంతృప్తిని వ్యక్తం చేసారు. సహాయ వ్యవసాయ సంచాలకులు, ఏడీఏ.హనుమంతరావు, మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్, సిబ్బంది లక్ష్మీ తిరుపతమ్మ పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని మాట్లాడారు. మొక్కజొన్న, శనగ సాగు చేసే రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలన్నారు. తప్పనిసరిగా విత్తనశుద్ధి చేపట్టిన తర్వాతే నాటుకోవాలని సూచించారు. ఈ–క్రాప్‌లో పంట నమోదు చేసుకుని, ఎకరాకు రూ.630లు పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

వేప నూనెతో నల్లతామర నివారణ

అచ్చంపేట: మిర్చి పంటలో నల్లతామర పురుగు నివారణకు వేప నూనె కషాయాన్ని మొక్క బాగా తడిచే వరకు పిచికారి చేయాలని ఏవో పి.వెంకటేశ్వర్లు చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలో రోకటిగుంటవారి పాలెంలో ఆయన మిర్చి పంటను పరిశీలించారు. నల్లతామర పురుగు ఉధృతిని గమనించి రైతులకు తగు సూచనలిచ్చారు. సర్పంచ్ రామకృష్ణ, వ్యవసాయ సిబ్బంది మాన్యనాయక్, రహీం రైతులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలి

నకరికల్లు: రానున్న తుఫాన్ నేపథ్యంలో కోతకు సిద్ధమైన వరి పంటను యంత్రంతో కోత కోయించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని చల్లగుండ్ల, అడ్డరోడ్డు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా కురిసే వర్షానికి ధాన్యం తడవకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ కె.రవిబాబు, వ్యవసాయ విస్తరణాధికారి కె.దిలీప్ కుమార్, ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

సత్తెనపల్లి: ఇసుక లారీ కింద పడి కాలు కోల్పోయిన వ్యక్తికి పట్టణానికి చెందిన కొత్త రామకృష్ణ, అతని మిత్రులు రూ.30వేలు ఆర్థిక సాయం మంగళవారం అందించారు. పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అయినవోలు శ్రీనివాసరావు కాలు పోగొట్టుకున్నాడు. ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర సభ్యులందరితో కలిసి మరోమారు సాయం అందిస్తామని వారు తెలిపారు. శ్రీనివాసరావుకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో బయన రామారావు, స్వామి ప్రసాద్, అయినవోలు సత్యశ్రీనివాసరావు, గుంటూరు ఆర్యవైశ్య సంఘం మాజీ కార్యదర్శి ముప్పవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న రామకృష్ణ, మిత్రులు

బడి లేదు..గుడి లేదు..‘కూటమి’లో అంతా బహిర్గతమే..

అచ్చంపేట: చూశారా... ఎంత పబ్లిక్‌గా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నారో.. ఇది లైసెన్స్‌డ్ మద్యం దుకాణం కాదు. ఇది మాదిపాడు పంచాయతీ పరిధిలో అడవిలో స్వయంభుగా వెలసిన సత్తెమ్మతల్లి దేవాలయం వద్ద ఉన్న ఒక పూజా సామగ్రి విక్రయ దుకాణం. ఇక్కడకు ప్రతి ఆది, శుక్రవారాల్లో భక్తులు దూర ప్రాంతాల నుంచి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఇక్కడ కొబ్బరికాయలు, సాంబ్రాణి కడ్డీలు, హారతి కర్పూరం వగైరాలు విక్రయించుకునేందుకు లైసెన్స్ పొందిన దుకాణం ఇది. అలాంటి పవిత్రమైన గుడి వద్ద ఎంత హుందాగా మద్యం విక్రయిస్తున్నారు. గుడి, బడి వద్ద మద్యం విక్రయాలు జరగకూడదు, అసలు బెల్ట్ షాపులకు ఆస్కారమే లేదు. కానీ, ఇప్పుడున్నది కూటమి ప్రభుత్వం...ఇవన్నీ సాధారణమేనంటున్నారు.. స్థానికులు. ఇక అమ్మవారే ఈ దారుణాలకు ఒక పరిష్కారం చూపాలని భక్తులు కోరుతున్నారు.



పూజాద్రవ్యాలు విక్రయించే దుకాణంలో విక్రయానికి సిద్ధంగా మద్యం బాటిళ్లు

బ్రాహ్మణ మహిళకు..ముస్లిం వ్యక్తి అంత్యక్రియలు

అచ్చంపేట: మండలంలోని మిట్టపాలెం గ్రామానికి చెందిన ఓ నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన 35 సంవత్సరాల వివాహిత మంగళవారం మృతిచెందింది. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా స్తోమతులేని ఆ కుటుంబానికి కమల్ సైదా బృందం ఆసరాగా నిలబడింది. బ్రహ్మణ ఆచార, సాంప్రదాయల మేరకు ఆమె అంత్యక్రియలను కమల్ సైదా బృందం నిర్వహించింది. 11వ రోజు కార్యక్రమాలకు కూడా తాము ఆర్థిక చేయూతనివ్వనున్నట్లు బృంద సభ్యుడు కమల్ సైదా తెలిపారు. బ్యాటరీ జాని, మీరా, కమల్, గోవిందు తదితులు అంత్యక్రియలు నిర్వహించిన వారిలో ఉన్నారు.



మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కమల్‌సైదా బృందం